## నిబంధనలు అతిక్రమించిన 10 దుకాణాల యజమానులపై కేసు



కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్

ఎదులాపురం, మే 9: ఆదిలాబాద్‌లో రాత్రి 10.30 తర్వాత వ్యాపార సముదాయాలు మూసివేయాలని వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. గత మూడు రోజులుగా ఆదిలాబాద్‌లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలువురు వ్యాపార సముదాయాల యజమానులు నిర్లక్ష్యంగా వహిస్తూ దుకాణాలను తెరిచి ఉండడంతో వారిపై శుక్రవారం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తెరచి ఉంచిన వ్యాపార సముదాయాలలో ముఖ్యంగా పాన్‌షాప్, టీషాప్ లు, కిరాణా దుకాణం, హోటల్స్, పలు రకాల వ్యాపార సంస్థల యజమానులు ఉన్నట్లు అందులోని పది మందిపై 10 కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఫాసిజంపై కమ్యూనిజం విజయమే విక్టరీ డే

ఎదులాపురం, మే 9: ఫాసిజంపై కమ్యూనిజం విజయం సాధించిన రోజే ప్రపంచంలో విక్టరీ డేగా ప్రసిద్ధి కెక్కిందని సీపీఎం రాష్ట్ర నాయకుడు కేవీవీ ఎన్ రాజు అన్నారు. ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అధ్యక్షతన శుక్రవారం ఫాసిజంపై కమ్యూనిజం విజయమనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్, గంగన్న, స్వామి నాయకులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, ప్రభు, గంగారాం, గంగాసాగర్ పాల్గొన్నారు.

## బోథ్‌కు చేరుకు బీసీ మేలుకోలుపు యాత్ర

బోథ్, మే 9: రాష్ట్రంలోని ప్రతి పల్లెల్లో బీసీల జెండా ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేలు కోలుపు రథయాత్ర బోథ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చాపర్తి కుమార్ గాడ్గే, మాచర్ల శ్రీనివాస్, అర్జున్, బీ గోవర్ధన్, శ్రీనివాస్, పోశెట్టి, మల్లెపూల శివారెడ్డి, కొండ స్వామి, గంగుల మల్లేశ్, జక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, మే 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. అటవీ ప్రాంతంలో చేపడుతున్న సీసీటీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

## ఎమ్మెల్యే కృషితో గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు

భీంపూర్, మే 9 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కృషితో ఇప్పటికే భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గోముత్రి, అంతర్గాం గ్రామాల్లో ఈ లైట్లను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ వేణు, గౌడి నారాయణ, జజ్జెరి జీవన్, బక్కి కపిల్‌యాదవ్, గుండావార్ ప్రకాశ్‌యాదవ్, పద్మయ్య, అశోక్, నితిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత

బోథ్, మే 9: రైతులకు పంట మార్పిడితో అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని మందబోగూడ గ్రామంలో ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ తక్కువ యూరియా వాడాలన్నారు. విత్తనాల, మందుల రసీదులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎల్ రవితేజ, ఏఈవో రామ్, రాజేందర్ పాల్గొన్నారు.

## ఉచిత ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి ఇంటివద్దనే అడ్మిషన్ తీసుకుంటున్న అధ్యాపకులు

ఇంద్రవెల్లి, మే 9: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందిస్తున్న ఉచిత ఇంటర్ విద్యను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధానకార్యదర్శి కాత్లె పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా(బీ)తో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఒత్తిడిలేని విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధుకర్, దళిత్, వెంకటేశ్, రవి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

దస్తురాబాద్, మే 9 : ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను మండల విద్యాధికారి గంగాధర్ కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో గ్రామ పెద్దలు, తల్లిందండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్య బోధనపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. సకాలంలో విద్యార్థులకు యూనిఫాంలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోట వేణు, ఉపాధ్యాయులు రవీందర్, కోటేశ్, సత్యం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్వాహకుడు అరెస్ట్

ఎదులాపురం, మే 9: ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన తొరాట్ ప్రీతం(గంజాయి నిర్వాహకుడు)ను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గంజాయి అమ్ముతున్న ప్రీతమ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఐదు గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## పర్యవేక్షణ కరువాయే.. పచ్చదనం పశుగ్రాసామాయే..



పార్కులో పచ్చని గడ్డి మేస్తున్న పశువులు

ఖానాపూర్ టౌన్, మే 9: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్కులో పర్యవేక్షణ లేకపోవడంతో పశువులు యథేచ్ఛగా సంచరిస్తూ గడ్డితో పాటు మొక్కలు నాశనం చేస్తున్నాయి. ప్రజలకు ఆహ్లాదవాతవరణం, ప్రశాంతత కోసం ఉద్యానవనాలు ఉపయోగపడుతాయనే ఉద్దేశ్యంతో లక్షలు వెచ్చించి నెలకొల్పిన ఉద్యానవనాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కళహీనంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు పార్కులో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎవరైనా అనుమానంగా కనిపిస్తే సమాచారం ఇవ్వండి

బాసర, మే 9 : చుట్టు పక్కల ఎవరైనా కొత్త వారు గాని, అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. శుక్రవారం రాత్రి బాసర రైల్వేస్టేషన్‌లో ఆమె తనిఖీ చేశారు. టీం శివంగి సిబ్బందితో పాటు స్పెషల్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ మెటల్ డిటెక్టర్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్‌తో పాటు బాసర ఆలయం, బస్‌స్టేషన్ ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఆమె వెంట భైంసా ఏఎస్పీ అవినాశ్, సీఐ మల్లేశ్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



బాసరలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ , పోలీసు సిబ్బంది

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తాంసి, మే 9: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని తహసీల్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో విత్తన దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మి, ఎస్ఐ దివ్యభారతి, రికార్డ్ అసిస్టెంట్ స్వాగత్, విత్తన దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



తాంసి: మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రవీందర్

ఉట్నూర్, మే 9: రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ వ్యవసాయశాఖ మండల అధికారి రమేశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని రైతు వేదికలో ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఉంచాల్సిన రకాల విత్తనాలు సూచించారు. నకిలీలతో చెలగాటాలు ఆడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకరమంలో ఏఈవోలు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

# బ్యాంకులకు జాబితాను పంపాలి

ఎదులాపురం, మే 9 : రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత హార్డ్ కాపీలను పరిశీలించి బ్యాంకులకు జాబితాను పంపాలని ఆదిలాబాద్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు వేగంగా సేవలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు.డెస్క్, బ్యాంక్ స్థాయిలో వెరిఫికేషన్ ఈ నెల 12 లోగా పూర్తి చేసి, 13 నుంచి 19 వరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ల వారీగా జాబితాలను సిద్ధం చేసి 26లోగా జిల్లా స్థాయి వెరిఫికేషన్ ముగించుకుని 29లోగా జిల్లా మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు జిల్లాలో మొత్తం 48,175 అందగా ఇప్పటి వరకు 38,911 దరఖాస్తులు వెరిఫికేషన్ చేసి బ్యాంకులకు ఎక్సెల్ షీట్ల రూపంలో పంపినట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నారు. మిగిలిన 27,496 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో ఉందని వివరించారు. మండల, గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. 2025 ఏప్రిల్ 6న ప్రారంభమైన రాజీవ్‌యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి వ్యాపారాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు రూ.3 లక్షల రుణాలు , 60 నుంచి 80 శాతం వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 30లోగా కమిటీ ఆమోదించి మంత్రికి నివేదికలు పంపించి జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు.ఈ సందర్భంగా బ్యాంకర్లు 3, 4 కేటగిరిల్లో ఉన్న దరఖాస్తుల సిబిల్ స్కోర్లు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అధికారులెవ్వరూ ఎంపిక ప్రక్రియలో లోటుపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. గూగుల్ మీట్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, డీఆర్డీవో, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు , తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

### నార్నూర్ అభివృద్ధిపై సమీక్ష

ఎదులాపురం, మే 9: అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నార్నూర్‌లో అభివృద్ధి పనులపై కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో డీఆర్డీవో, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నార్నూర్ బ్లాక్ డెవలప్‌మెంట్ కోసం నీతి ఆయోగ్ వాటర్ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌లో భాగంగా చెరువుల పూడికతీత పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మండలంలోని 14 గ్రామాల్లో బాలన్‌పూర్, నార్నూర్, గంగాపూర్ ట్యాంక్-1, ట్యాంక్ -2లో పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో 2, 3 రోజుల్లో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద నార్నూర్ మండలంలోని గ్రామాల్లో ఐహెచ్‌హెచ్ఎల్ పథకం ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలను లక్ష్యాలను శాతం వందకు చేరేలా పూర్తి చేయాలని డీఆర్డీవోను ఆదేశించారు. వివిధ అంశాలలో ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని, వర్షాకాలం రాకముందు క్రిటికల్ హాబిటేషన్‌ల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్, బీఏఐఎఫ్ ఎన్జీవో ప్రతినిధులు సాయి, సుధాకర్, రాకేశ్, డీడబ్ల్యూవో, ఈఈపీఆర్, ఎంపీవో, ఏపీవో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమ్

ఎదులాపురం, మే 9: ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి గౌతమ్ కార్యనిర్వాహక కార్యదర్శి అజయ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జనగాం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా నెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి హరిచరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు మజార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిర్మల్‌కు చేరుకున్న బీసీ మేలుకొలుపు రథయాత్ర

నిర్మల్ చైన్‌గేట్, మే 9: రాష్ట్ర ప్రభుత్వ అసెంబ్లీలో తీర్మాణం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని దేశ వ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. బీసీ మేలు కొలుపు రథయాత్ర శుక్రవారం నిర్మల్‌కు చేరుకుంది. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, కార్యనిర్వాహణ అధ్యక్షుడు ఈసవేని మనోజ్‌యాదవ్, సహా అధ్యక్షుడు అనుముల భాస్కర్, యాటకారి సాయన్న, ఆకుల సుదర్శన్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గాడ్గె పాల్గొన్నారు.

## విద్యుత్ మోటర్లు చోరీ

లక్ష్మణచాంద, మే 9: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి (కే) గ్రామ సమీపంలోని సరస్వతీ కాలువకు 16 నంబర్ ఉపకాలువ నుంచి గురువారం రాత్రి మూడు విద్యుత్ మోటర్లు చోరీ గుర్తైనవి. శుక్రవారం ఉదయం పంట చేనుకు వెళ్లిన రైతులు కాలువ పెట్టిన ఉప కాలువలో పెట్టిన విద్యుత్ మోటర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దాంతో పీచర గ్రామానికి చెందిన రైతులు నరేశ్, పోతుగంటి శ్రీధర్, పోతుగంటి భూమేశ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ప్రియాంక తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

నర్సాపూర్(జీ), మే 9 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని తురాటి గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్కెర గంగాధర్ (41) అనే రైతు శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఊర చెరువలో తన ఎడ్లను కడగడానికి తన కుమారుడితో వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య ముక్కెర సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

## ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

తానూర్, మే 9 :నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని దహగాం గ్రామానికి చెందిన గాడేకర్ గులాబ్ (40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రైనీ ఎస్ఐ నవనీత్‌రెడ్డి తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య శాంతబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ తెలిపారు.

## స్వర్ణ వాగులో పడి మహిళ మృతి

సారంగాపూర్, మే 9: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం వంజర్ గ్రామానికి చెందిన చాట్ల లక్ష్మి (55) మతిస్థిమితం లేని మహిళ స్వర్ణ వాగులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మి మతిస్థిమితం బాగా లేక గ్రామంలో తిరుగుతూ ఉండేది. తనకు ఎవరు కూడా లేకపోవడంతో గ్రామంలో ఒంటరిగానే తిరుగుతూ ఉండేది. మూడు రోజుల నుంచి గ్రామంలో లక్ష్మి కనిపించకపోగా గ్రామస్తులు వెతుకుతూ ఉంటే వంజర్ గ్రామ శివారులో గల స్వర్ణ వాగుచెక్‌డ్యామ్ నీటిలో మునిగి మృతి చెంది ఉంది. రోజు లాగే చెక్‌డ్యామ్‌లో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయి ఉండవచ్చిని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతిరాలి బంధువు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## అడవి పంది దాడిలో ఒకరి..

ఇంద్రవెల్లి, మే 9: అడవి పంది దాడిలో ఒకరూ మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని చిలాటిగూడ గ్రామ అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. దోడంద గ్రామ పంచాయతీ పరిధిలోని చిలాటిగూడకు చెందిన మడావి బొజ్జు(55), అదే గ్రామానికి చెందిన పుసం నాందేవ్, మడావి మంతులు కలిసి మేకల మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లారు. మేకలు మేస్తుండగా ఓ చెట్టు కింద ఉన్న మడావి బొజ్జుపై అడవి పంది దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోడుగా ఉన్న పుసం నాందేవ్, మడావి మంతులు ఓ చెట్టుపైకి ఎక్కి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అడవి పంది దాడి చేసిన మడావి బొజ్జు మృతి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామ నిర్వహించి పోస్ట్‌మార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి నోటీసులు

ఎదులాపురం, మే 9: గంజాయి కేసులో నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి నోటీసులు ఇచ్చామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అంబాదాస్ 3 మే 2024 నాడు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి ఇకపై నిబంధనలో ఉల్లంఘించానని ఒకవేళ ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా కట్టాల్సి వస్తుందని తహసీల్దార్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.లక్ష కట్టాలని పది రోజుల్లో జమ చేయాలని అంబాదాస్‌కు నోటీసులు జారీ చేశామన్నారు.

## బెదిరించి రూ.5 వేలు తీసుకున్న వ్యక్తులపై కేసు

ఎదులాపురం, మే 9: ఆదిలాబాద్‌కు చెందిన అర్బాస్ గురువారం అర్ధరాత్రి 12 గంటలకు రైల్వే ద్వారా ఆదిలాబాద్‌కు వస్తున్నాడు. పార్కింగ్ స్థలం వద్ద ఆదిలాబాద్‌కు చెందిన కాసింతోపాటు మరికొందరు అర్బాస్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5 వేలు లాక్కున్నారు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

## సోలార్ జల వికాసం ప్లాన్‌టేషన్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఉయిక విష్ణు

ఇంద్రవెల్లి, మే 9: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం పిప్రి గ్రామంలో అటవీ హక్కు భూములు ఉన్న 55 కుటుంబాలకు సోలార్ జల వికాసం పథకం ద్వారా సాగునీరు అందించే సోలార్ ప్లాన్‌టేషన్ మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. శుక్రవారం పిప్రి గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురవకముందే అటవీ హక్కు భూములపై సర్వేలు చేపట్టి గుర్తించి సోలార్ జల వికాసం పథకం ద్వారా సోలార్ ప్లాన్‌టేషన్లు మంజూరు చేయాలన్నారు. జూన్‌లో వర్షాలు కురిస్తే రైతులు వ్యవసాయ పనులు చేయడంలో నిమగ్నమై ఉంటారని అన్నారు. ఈ నెల చివరి వరకు అటవీ హక్కు భూముల జల వికాసం పథకం సోలార్ ప్లాన్‌టేషన్ బోర్‌వెల్స్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### మాకు రక్షణ కల్పించాలి

దస్తురాబాద్, మే 9 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్ గ్రామ మత్స్యకారుల నుంచి మాకు రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్‌లో, తహసీల్ కార్యాలయాల్లో దస్తురాబాద్ మత్స్యకారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మత్స్యశాఖ నుంచి గోదావరిలో చేపలు పట్టడానికి లైసెన్స్‌లు జారీ చేస్తారు కానీ కొంత కాలంగా రాంపూర్ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు గోదావరిలో చేపలు పట్టనివ్వకుండా మాపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని సంవత్సరాల క్రితం మాపై దాడులు చేసినట్లు అని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ లకు తెలపడం జరిగిందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు చేపలు పట్టడానికి వెళ్తున్నట్లు తెలిపారు. మా యొక్క చేపల వేటకు ప్రతి సారి అడ్డుపడుతున్నా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని, చేపలు పట్టే సమయంలో రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జుంబర్తి రాజన్న, బోరే గంగన్న, శ్రీనివాస్, శంకర్, నారాయణ, పెద్ద భీమన్న, పోశం, నర్సయ్య పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి(భీంపూర్), మే 9: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని సబ్ స్టేషన్‌లో శనివారం 33/11 కేవీ మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని నిపాని, అర్లి(టీ), భీంపూర్ గ్రామాల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్, మే 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్, పొచ్చెర 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజినీర్ శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దస్తురాబాద్, మే 9 :నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బుట్టాపూర్, చెన్నూర్, గొడిసేర్యాల, రేవోజిపేట, మల్లాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

## ఫేక్‌ఐడీ క్రియేట్ చేసి మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్

బోథ్, మే 9: ఆదిలాబాద్ షీ టీం బృందాలు మహిళలకు యువతులకు రక్షణగా ఉంటూ వేధింపులకు గురి చేసిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. బోథ్‌కు చెందిన యువతిని నిర్మల్‌కు చెందిన సాయి అనే యువకుడు స్నాప్ చాట్‌లో వేధింపులకు గురి చేసిన ఫిర్యాదుతో ఆదిలాబాద్ షీటీం బృందం నిందితుడిని రప్పించి బోథ్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. మహిళలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైన, సోషల్ మీడియాలో పని ప్రదేశాలలో కళాశాలల్లో, పాఠశాలల్లో ఎలాంటి వేధింపులకు గురైన వెంటనే ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని తెలిపారు. ఆదిలాబాద్ షీ టీం బృందం 8712659953 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీ టీం బృంద సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రవీణ్

## దడువాయి కార్యవర్గం

భైంసా, మే 9 : నిర్మల్ జిల్లా భైంసా వ్యవసాయ మార్కెట్ దడువాయి యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సతీశ్, ఉపాధ్యక్షుడిగా రామారావు, కోశాధికారిగా పోతన్నను ఎన్నుకున్నారు. వీరికి యూనియన్ నాయకులు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

## సకాలంలో పుస్తకాల పంపిణీ చేపట్టాలి

నిర్మల్ అర్బన్, మే 9: సకాలంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని డీఈవో రామారావు అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ గోదాంలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాల గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు సరిపడా నోటు, పాఠ్యపుస్తకాల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లాకు ఇప్పటి వరకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, ఇంకా రావాల్సిన పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

## సకాలంలో స్పందించి.. వైద్యం అందించి

దస్తురాబాద్, మే 9 : ఉపాధి హామీ ప్రదేశంలో పని చేస్తుండగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మున్యాలతండా గ్రామానికి చెందిన భూక్యా లావణ్యకు గడ్డపార కాలు పాదంపై పడడంతో గాయపడింది. దీంతో సకాలంలో స్పందించిన ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ మున్యాల గ్రామంలోని ఆర్ఎంపీ దగ్గరికు తీసుకెళ్లి తన సొంత డబ్బులతో ప్రథమ చికిత్స చేయించి వైద్యం అందించాడు. గ్రామస్తులు సురేశ్ నాయక్, శివలాల్ నాయక్, శ్రీధర్ నాయక్ ఉన్నారు.

## బస్సు మాచాపూర్‌కు రానివ్వడం లేదని ఆందోళన



మల్లాపూర్‌లో ఆందోళన చేస్తున్న మచాపూర్ గ్రామస్తులు

లక్ష్మణచాంద, మే 9: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ గ్రామం నుంచి మాచాపూర్ గ్రామానికి బస్సు రానివ్వడం లేదని శుక్రవారం మాచాపూర్ గ్రామస్తులు మల్లాపూర్‌లో ఆందోళన చేశారు. మల్లాపూర్ నుంచి మాచాపూర్‌కు వెళ్లే రహదారిపై మల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తన ఇంటి సమీపంలో వేసిన పైపులైన్లు పగులుతాయని భావించి రోడ్డుపై బస్సు వెళ్లకుండా బండరాళ్ళు ఉంచాడు. దాంతో ఆర్టీసీ బస్సు మాచాపూర్‌కు వెళ్లడంలేదు. తమ గ్రామానికి బస్సు రావడాన్ని అడ్డుకుంటున్నందుకు శుక్రవారం మాచాపూర్ గ్రామస్తులు మల్లాపూర్‌లో ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ ప్రియాంక సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింప చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్ళు తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

## సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించవద్దు

నిర్మల్ అర్బన్, మే 9 : సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై శుక్రవారం కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హైదర్ మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాల్టీకి వివిధ పథకాల కింద వచ్చిన దరఖాస్తుల సమాచారాన్ని ఇవ్వాలని అధికారులకు కోరిన వారు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యవర్గం

నిర్మల్ చైన్‌గేట్, మే 9 : నిర్మల్‌లోని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా చైర్మన్‌గా విక్రమ్, వైస్‌చైర్మన్‌గా వొడ్నాల రాజు, భీమ్‌రాజు, కార్యదర్శిగా పొన్నం శివాజీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌నాయక్, కోకన్వీనర్‌గా డీ సూర్యరాజ్, జాయింట్ సెక్రటరీగా రవి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా తొగిటి రామ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు.